సాక్షి
వనపర్తి
సోమవారం । 2 । జూన్ । 2025



అనుమతుల మాటున..!

దుందుబి నదిలో అనుమతుల మాటున ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే వరద ఆదివారం మరింత తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /23.4

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ కనిపిస్తుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు వర్షం కురవచ్చు.

న్యూస్‌రీల్

ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం



వనపర్తి: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జిల్లా పోలీస్ పరేడ్ మైదానంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల భవనాలను రంగురంగుల విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 9.50 గంటలకు ఎస్పీ రావుల గిరిధర్, 9.55కు కలెక్టర్ ఆదర్శ్ సురభి, 9.58కి ముఖ్యఅతిథి ప్రీతం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వేదికకు చేరుకొని అమరవీరులకు నివాళులు అర్పిస్తారు.
- 10 గంటలకు ముఖ్యఅతిథి జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ, రాష్ట్ర గీతాలాపన, పోలీసుల వందన సమర్పణ ఉంటుంది.
- 10.10 గంటలకు ముఖ్యఅతిథి జిల్లా ప్రగతిపై సందేశం. 10.30కి స్వాతంత్ర్య సమర యోధులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాల సన్మానం ఉంటుంది.
- 10.35 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10.50కి వివిధ పథకాల లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ, 11 గంటలకు స్టాల్స్ సందర్శనతో కార్యక్రమం ముగియనుంది.

‘బొమ్మా, బొరుసుగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలన’



వనపర్తిటౌన్: బొమ్మా, బొరుసుగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని.. పార్టీలు వేరైనా చేసే అవినీతి ఒక్కటేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆరోపించారు. ఆయా పార్టీల పాలనపై ప్రజలకు అవగాహన వచ్చిందని, ఏ పార్టీ వచ్చినా అవినీతి, అక్రమాలు ఆగవనే నిజాన్ని గ్రహించారని ఎద్దేవా చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో పార్టీ జిల్లా మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఆ పార్టీ అభ్యర్థులు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తూకం చేయకుండా రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, 18 నెలలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై భారీగా అవినీతికి తెర లేపారని ఆరోపించారు. సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు మున్నూరు రవీందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి, అధికారులకు సమన్వయం కొరవడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమని చెప్పారు. వరి కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రధాని మోదీ 14 రకాల చిరుధాన్యాల మద్దతు ధర పెంచి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ప్రధానకార్యదర్శి రామన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బండారు కుమారస్వామి, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు ఆగపోగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా 3X3 పురుషులు, మహిళా బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ అహ్మద్, జాకీర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాటాడారు. బుధ, గురువారం జిల్లాకేంద్రంలోని ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలో మొదటి రాష్ట్రస్థాయి 3X3 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, 50 మంది అఫీషియల్స్ హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించారు. సభ్యులు మీర్ ఖాలెద్ అలీ, మహ్మద్ ఇలియాజ్, సుబాన్‌జీ, గోపాలకృష్ణ, ఫారూఖ్ ముకర్రం, మహ్మద్ షకీల్, వినోదకుమార్, బాలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పథం

ప్రత్యేక రాష్ట్రంలో అన్నిరంగాల్లో జిల్లా పురోగతి



చిట్యాల సమీపంలో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డు

- పదేళ్లలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- ప్రభుత్వ వైద్య, ఇంజినీరింగ్, ఫిషరీస్ తదితర కళాశాలల ఏర్పాటు
- క్యాన్సర్‌కేర్, ప్రసూతి, డయాలసిస్, 650 పడకల ఆస్పత్రి నిర్మాణం
- 2016–17తో పోలిస్తే నాలుగింతలు పెరిగిన వరి పంటలు

వనపర్తి: పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో జిల్లా వ్యవసాయ, విద్య, వైద్యం తదితర అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. వ్యవసాయ ఉత్పత్తులు నాలుగింతలు పెరిగినట్లు ప్రస్తుతం ఉమ్మడి పాలమూరులోనే అత్యధికంగా కొనుగోలు చేస్తున్న వరి ధాన్యంతో స్పష్టమవుతోంది. పదేళ్ల కిందటి వరకు వానాకాలంలో 78 వేల ఎకరాలు, యాసంగిలో 34 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా.. ప్రస్తుతం వానాకాలంలో 1.94 లక్షల ఎకరాలు, యాసంగిలో 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వరి సాగు, ఉత్పత్తి నాలుగింతలు పెరగడంతో జిల్లాను రైస్‌బౌల్‌గా స్థానిక ప్రజలు అభివర్ణిస్తున్నారు. ప్రస్తుత యాసంగిలో ఏకంగా 3.98 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించుకోవడం గమనార్హం. ఇందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా నిర్మించిన భీమా, కేఎల్‌ఐతో పాటు జూరాల వరద నీటితో చెరువులు, రిజర్వాయర్లను నింపుతుండటంతో భూగర్భ జలాలు పెరగడం, నీటిని ఎక్కువగా నిల్వ చేసుకొని అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవడం, కొత్త కాల్వలను పాత కాల్వలకు అనుసంధానంగా నిర్మాణం చేసుకోవడంతోనే సాధ్యమైందని చెప్పవచ్చు.

650 పడకలతో జిల్లా జనరల్ ఆస్పత్రి..

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నాటి వంద పడకల ఏరియా ఆస్పత్రి నేడు 650 పడకలతో జిల్లా జనరల్ ఆస్పత్రిగా సర్కారు తీర్చిదిద్దింది. పేదలు ప్రసవాలకు ప్రైవేట్‌ను ఆశ్రయించి రూ.వేలు ఖర్చు చేయకుండా వాటికి దీటుగా సాధారణ, సిజేరియన్ కాన్పులు చేస్తూ సర్కారు వైద్యంపై భరోసా కల్పిస్తున్నారు. ఒక్క జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రతి నెల 400కు తగ్గకుండా ప్రసవాలు జరుగుతున్నాయి. దీంతోపాటు క్యాన్సర్ కేర్, డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు దీటుగా జిల్లాకేంద్రంలో ఏర్పాటైన తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో సుమారు 80 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా వైద్యుల సూచన మేరకు చేస్తుండడం గమనార్హం. స్వరాష్ట్రంలో ప్రతిరంగంలో జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు జిల్లా ప్రగతి నివేదికతో వెల్లడవుతోంది.



వనపర్తిలోని సమీకృత మార్కెట్‌యార్డు

నాటి నుంచి విద్యాపర్తిగా..



ప్రభుత్వ వైద్య కళాశాల

సంస్థానాధీశుల కాలం నుంచే వనపర్తికి విద్యాపర్తిగా పేరుంది. గద్వాల, అయిజ తదితర ప్రాంతాల నుంచి విద్యనభ్యసించేందుకు ఈ ప్రాంతానికి వస్తుంటారు. నాటి నుంచి డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా.. ప్రత్యేక రాష్ట్రంలో కొత్తగా జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్, ప్రభుత్వ మెడికల్, నర్సింగ్, అగ్రికల్చర్ కళాశాలలు, రెండో ఫిషరీష్ కళాశాల ఏర్పాటు విద్యపరంగా జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆయా కళాశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వేలాది మంది విద్యార్థులు జిల్లాకు తరలివస్తుండగా.. వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేయడంతో పాటు తగిన వసతులు కల్పించింది.

నేటినుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ అండర్–19 క్రికెట్



గత నెలలో ఎండీసీఏ మైదానంలో ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లకు క్రీడాకారుల ఎంపిక (ఫైల్)

- ఆరు జట్లు.. 15 లీగ్ మ్యాచ్‌లు
- ఉమ్మడి జిల్లాలోని ఆరు వేదికల్లో మ్యాచ్‌ల నిర్వహణ
- అధిక పాయింట్లు సాధించిన జట్టు విజేత

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలో ఎండీసీఏ ఆధ్వర్యంలో మరోసారి ఇంట్రా డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ జరగనుంది. గత నెల 19 నుంచి 31 వరకు అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌ను నిర్వహించగా మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌షిప్‌గా నిలిచింది. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇప్పుడు అండర్– 19 క్రికెట్ లీగ్‌ను నిర్వహించనున్నారు.

2 నుంచి 6 వరకు..

ఔత్సాహిక గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం సోమవారం నుంచి శుక్రవారం వరకు ఇంట్రా డిస్ట్రిక్ట్ పురుషుల అండర్–19 క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎండీసీఏ ఆధ్వర్యంలో లీగ్‌కు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లీగ్‌లో పాల్గొనే ఆరు జట్లను రెండు పూల్‌లుగా విభజించారు. పూల్–ఏలో జడ్చర్ల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జట్లు, పూల్–బీలో మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జట్లు ఉన్నాయి. ఐదు రౌండ్లలో 15 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. 50 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. లీగ్‌లో ఎక్కువ పాయింట్లు సాధించిన జట్టు చాంపియన్‌గా నిలుస్తుంది.

లీగ్ మ్యాచ్‌ల వివరాలు

ఉమ్మడి జిల్లాలోని ఆరు వేదికల్లో అండర్–19 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి రౌండ్‌కు సంబంధించి సోమవారం మహబూబ్‌నగర్– వనపర్తి జట్లు (వేదిక– మహబూబ్‌నగర్), జడ్చర్ల– గద్వాల జట్లు (జడ్చర్ల), నారాయణపేట– నాగర్‌కర్నూల్ (నారాయణపేట) జరుగుతాయి.

- రెండో రౌండ్ మంగళవారం నాగర్‌కర్నూల్– మహబూబ్‌నగర్ జట్లు (మహబూబ్‌నగర్), గద్వాల– వనపర్తి (వనపర్తి), జడ్చర్ల– నారాయణపేట (జడ్చర్ల) మ్యాచ్‌లు ఉంటాయి.
- మూడో రౌండ్ బుధవారం మహబూబ్‌నగర్– గద్వాల (మహబూబ్‌నగర్), నాగర్‌కర్నూల్– జడ్చర్ల (జడ్చర్ల), వనపర్తి– నారాయణపేట (వనపర్తి) కొనసాగుతాయి.
- నాలుగో రౌండ్ గురువారం మహబూబ్‌నగర్– నారాయణపేట (మహబూబ్‌నగర్), జడ్చర్ల– వనపర్తి (జడ్చర్ల), గద్వాల– నాగర్‌కర్నూల్ (గద్వాల) ఉంటాయి.
- ఐదో రౌండ్ శుక్రవారం జడ్చర్ల– మహబూబ్‌నగర్ (మహబూబ్‌నగర్), నాగర్‌కర్నూల్– వనపర్తి (నాగర్‌కర్నూల్), గద్వాల– నారాయణపేట (గద్వాల)లో నిర్వహిస్తారు.

క్రీడాకారులు రాణించాలి

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లు నిర్వహిస్తోంది. ఇటీవలే అండర్–23 లీగ్‌ను విజయవంతం చేశాం. అండర్–19 లీగ్‌ను కూడా అదేవిధంగా నిర్వహిస్తాం. ముఖ్యంగా గ్రామీణ క్రీడాకారులకు ఈ లీగ్ ఒక వరంలా మారనుంది. ఇంట్రా డిస్ట్రిక్ట్ అండర్–19 లీగ్‌లో క్రీడాకారులు రాణించాలి. ఈ లీగ్‌లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రానున్న హెచ్‌సీఏ లీగ్‌లలో పాల్గొనే ఎండీసీఏ జట్లకు ఎంపిక చేస్తాం. ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లు నిర్వహిస్తున్న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఆర్థిక ఇబ్బందులున్నా.. హామీలు అమలు చేస్తాం



పుల్గర్‌చర్లలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని పుల్గర్‌చర్లలో రూ.2.94 కోట్లతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్, కల్వరాలకు నూతనంగా ఏర్పాటు చేయనున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయం, మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు రైతులు, విద్యార్థులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లతోపాటు రాజీవ్ యువ వికాసం, సన్నరకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ తదితర సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజశేఖరం, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ మల్లయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి కల్వరాల నర్సింహ, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్, నారాయణరెడ్డి, బిచ్చయ్యసాగర్, సుదర్శన్‌రెడ్డి, నరేష్, బాల్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లావ్యాప్తంగా నెలరోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాక్ట్ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు అమలులో ఉన్నందున పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడే కార్యక్రమాలు నిర్వహించరాదని వివరించారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో రాజకీయ, కులమతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని.. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తుగా దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని కోరారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



కడుకుంట్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఐఐఓఆర్ ప్రధాన శాస్త్రవేత్తలు డా. ఆర్డీ ప్రసాద్ వానాకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కలిపించారు. ఆముదం, వేరుశనగ సాగులో మెళకువలు, సాంకేతికత గురించి వివరించారు. కేవీకే మదనాపురం శాస్త్రవేత్త భవాని మాట్లాడుతూ.. వానాకాలంలో వరి, కంది సాగుకు అనుకూలమైనవని, రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కిసాన్ డ్రోన్లు, బయో ఎరువుల గురించి వివరించారు. ఏఈఓ కవిత మాట్లాడుతూ.. భూమి సారవంతంగా ఉండాలంటే రైతులు పచ్చిరొట్ట పైర్లు 40 రోజులు ముందుగా వేసుకొని పూత దశలో కలియదున్నాలని, దీంతో భూసారం దెబ్బ తినకుండా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా వరి కొయ్యలను తగలబెట్టరాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవర్ధన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నర్సింగాపురంలో..

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో ప్రధాన పంటలైన వరి, పత్తి, వేరుశనగ, జీలుగ, కంది పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త అనిత సంతులిత, సేంద్రియ ఎరువుల వినియోగం, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. విత్తన ఎంపికపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ గాయత్రి, మాజీ సర్పంచ్ హనుమాన్‌రావు, మైనుద్దీన్, కాశన్న, గట్టన్న తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

వనపర్తి విద్యావిభాగం: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య శనివారం వెల్లడించారు. జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రయోగ పరీక్షలు కొనసాగుతాయన్నారు. 3న వృక్షశాస్త్రం, 4న జంతు శాస్త్రం, 4, 5 తేదీల్లో భౌతిక శాస్త్రం, 5, 6న రసాయన శాస్త్రం పరీక్షలు జరుగుతాయని వివరించారు. అదేమాదిరిగా జూన్ 9, 10న ఇంగ్లీష్, 11న పర్యావరణ విద్య పరీక్ష, 12న నైతికత, మానవ విలువలు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను కళాశాల నుంచి లేదా ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని, సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఒకేసారి మూడు నెలల రేషన్

- కేంద్రం నిర్ణయంతో ముందుకు..
- రేషన్ దుకాణాలకు బియ్యం తరలింపు
- నిల్వ చేసుకునేందుకు స్థలం కరువు.. ఇబ్బందులు పడుతున్న డీలర్లు

వనపర్తి: కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలకు మూడునెలల బియ్యం కోటా ఒకేసారి ఎంఎల్‌ఎస్ గోదాం నుంచి తరలిస్తున్నారు. బియ్యం తరలింపును పౌరసరఫరాలశాఖ అధికారులతో పాటు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మూడు నెలల కోటా నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులు ఆయా రేషన్ డీలర్లు, అధికారులు, ఎంఎల్‌ఎస్‌పీ గోదాంల ఇన్‌చార్జ్‌లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు సూచించారు. ఒక్కో కార్డుదారుడి నుంచి మూడుసార్లు వేలిముద్రలు తీసుకొని బియ్యం పంపిణీ చేయాలని అధికారులు నిబంధనలు రూపొందించారు. వాతావరణ మార్పులను ముందస్తుగా అంచనా వేసిన కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సన్న బియ్యం పంపిణీతో పెరిగిన ఆసక్తి..

రెండునెలలుగా రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో 90 శాతం మంది లబ్ధిదారులు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో దొడ్డురకం బియ్యం పంపిణీ చేస్తుండటంతో చాలావరకు రేషన్ దుకాణాల నుంచి రీసైక్లింగ్ అయ్యేవి. ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీతో పరిస్థితులు పూర్తిగా మారినట్లు క్షేత్రస్థాయిలో వినిపిస్తోంది. సన్న బియ్యం పంపిణీతో ప్రజాపంపిణీ లక్ష్యం నెరవేరుతోందని అధికారులు సైతం కితాబిచ్చారు.

ఈ నెల 30 వరకు గడువు..

ఈ నెల 30వ తేదీలోగా జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులకు జూన్, జూలై, ఆగస్టు బియ్యం కోటాను రేషన్ డీలర్లు పంపిణీ చేయాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావాల్సిన మౌలిక వసతులు సమకూర్చుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులు డీలర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.



జిల్లాలో ఇలా..

మండలాలు	రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు
15	324	1,61,316

అంత్యోదయ కార్డులు	లబ్ధిదారులు
10,514	5,58,334

అన్నపూర్ణ కార్డులు	మూడునెలల కోటా
109	10,555.422 మెట్రిక్ టన్నులు

బియ్యం నిల్వకు స్థలాలు కరువు?

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న రేషన్ దుకాణాల్లో ఒకనెల కోటా బియ్యం పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునేందుకు సరిపడా స్థలం లేదు. ఏకంగా ఒకేసారి మూడు నెలల కోటా నిల్వ చేసుకునేందుకు అదనంగా సమీపంలో మరో దుకాణం లేదా గోదాం ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. బియ్యం పంపిణీపై ఆయా మండలాల తహసీల్దారు నిశితంగా పర్యవేక్షణ చేస్తున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం..



ప్రభుత్వ ఆదేశానుసారం మూడునెలల రేషన్ బియ్యం ఈ నెల 30వ తేదీలోగా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డీలర్లుక ఆదేశాలిచ్చాం. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నాం. ఎక్కడా ఫిర్యాదులు, పొరపాట్లకు తావులేకుండా ప్రజాపంపిణీ చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం.

– కాశీవిశ్వనాథ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన రాంచంద్రయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో ఆదివారం అతని మృతిపై అనుమానం ఉన్నట్లు భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. తిర్మలగిరి గ్రామానికి చెందిన రాంచంద్రయ్య(57) శనివారం రాత్రి ఇంట్లో పడుకున్న చోటే మృతి చెందాడు. భర్త మృతిపై అనుమానం ఉండటంతో పోలీసులకు భార్య పోలే మైసమ్మ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదు స్సేన్‌పల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఎం.వేణు తెలిపారు. గ్రామానికి చెందిన కంతి కాశన్న (55) కూలీ పనులు చేసి జీవనం సాగించేవాడు. అయితే కొన్నాళ్ల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో అందరూ భోజనం చేసి పడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కుమారుడు మహేష్ తండ్రి కోసం వెతకగా బాత్‌రూంలో ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన అశ్వ శంకరమ్మ (45)ను భర్త అశ్వ విశ్వనాథం (రెండో భార్య) పుట్టింటికి పంపకపోవడంతో భర్తతో గొడవపడి మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్లులో ఎలుకల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు అశ్వ చంద్రయ్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెద్దదిన్నె గ్రామంలో వృద్ధుడు..

ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె గ్రామానికి చెందిన గొల్ల నారాయణ (71) చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. నారాయణ పదేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 24న తన కల్లం దొడ్డిలోని గుడిసెలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు గొల్ల బాలకృష్ణ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



కుర్వ కతాల్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మంతటి చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంతటి గ్రామానికి చెందిన కుర్వ కతాల్ (45) మంతటి చౌరస్తా వద్ద చికెన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కల్వకుర్తి రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి ప్రకాష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ప్రకాష్ ఊరుకొండ మండల కేంద్రానికి చెందిన ఒక యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం ఎటు తేలక పోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.



STOCKYARD COPY
GOVERNMENT OF TELANGANA
Telangana Mineral Development Corporation
FORM-S3(a) - TRANSIT PASS for Pattalands
MAHABUBNAGAR District

Name of the Mineral	SAND
District Code	03
Agency Name	NAVABHARAT READYMIX CONCRETE
Date & Time of Despatch	2025-05-22 08:11:04.630
Order Id & Date	PCBLK078634 2025-05-20 17:17:48.780
Transit Pass No	TRANCA45C28D
Order Quantity	3000.00 MT
Order Amount(Rs.)	1185160.00(375.00 /- Per MT)
Consigner Name	Kothapally87
Stockyard (Pattaland) Address	Kothapally(V), Midjil(M),Mahabubnagar(D)

టీజీఎండీసీ జారీ చేసిన పాస్



దుందుబీ వాగులోకి బారులు తీరిన టిప్పర్లు

అనుమతుల మాటున..!



దుందుబీ వాగులో హిటాచీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు

- దుందుభీలో దర్జాగా ఇసుక దందా
- నిత్యం వందలాది టిప్పర్లతో తరలింపు
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- డార్క్ ఏరియాలోనూ నీరుగారుతున్న వాల్టా చట్టం
- ఇసుక అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ గ్రామస్తుల ఆందోళనలు

జడ్చర్ల: ఇసుక అనుమతుల మాటున కొందరు అక్రమాలకు తెరలేపారు. దుందుబీ నదిలో ఏకంగా హిటాచీ యంత్రాలను ఉపయోగించి రాత్రింబవళ్లు వందల టిప్పర్లలో ఇసుకను తోడేసి హైద్రాబాద్, తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము వెనకేసుకుంటున్నారు. అనుమతుల మాటున సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విసిగి వేసారిన రైతులు, విపక్ష పార్టీల నాయకులు ఇసుక టిప్పర్లను అడ్డుకొని స్వయంగా పోలీసులకు అప్పగిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

అనుమతులు పొందారిలా..

మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామ శివార్లలో గల దుందుబీ వాగు శివారులోని భూములలో ఇసుక నిల్వలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఈ నేపథ్యంలో సర్వే నంబర్లు 87 నుంచి 99 వరకు సంబంధించి దాదాపు 19.14 ఎకరాల విస్తీర్ణంలో గల ఇసుక తవ్వకాలు జరిపేందుకు పట్టాదారు మహ్మద్ జహిరొద్దీన్ తదితరులు జిల్లా కలెక్టర్ నుంచి 23 జనవరి 2025న అనుమతులు పొందారు. ఇందుకు ఆర్నెళ్ల కాలవ్యవధిగా నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 78వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో గల 1,95,000 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు వీలుగా నిబంధనలు రూపొందించారు. 2.5 మీటర్ల లోతు వరకు మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని స్పష్టంగా ఉత్తర్వులలో పేర్కొన్నారు. అదేవిధంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకను నిర్దేశిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంది. ఇక జిల్లా పరిధిలో మాత్రమే ప్రభుత్వ, ప్రైవేట్ పనులకు ఇసుకను రవాణా చేయాల్సి ఉంది. అంతేగాక నీటి పారుదల శాఖ నిర్ణయించిన బఫర్ జోన్‌లోకి వెళ్లకుండా పరిధి కూడా నిర్ణయించారు. నీటిపారుదల శాఖ నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. వీటితో పాటు తవ్వకాలు జరిపే సమీపంలో గల ప్రభుత్వ భూములలోకి కూడా వెళ్లకూడదన్న నిబంధనలు ఉన్నాయి. తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిబంధనలు తూ.చా తప్పకుండా అమలు చేసే విధంగా చూడాల్సి ఉంది. అదేవిధంగా అనుమతులు ఉన్న క్వారీకి హద్దులు నిర్ణయించడంతో పాటు ఆయా నిబంధనలను అతిక్రమించకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉంది. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునే పరిస్థితి కూడా ఉంది.

గ్రామస్తుల అడ్డగింతలు.. నిరసనలు

విచ్చలవిడిగా ప్రతి రోజు వందల టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్న క్రమంలో విసిగి వేసారిన ఆయా గ్రామాల రైతులు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ ఇసుక టిప్పర్లను అడ్డుకుంటూ ఆందోళనలకు దిగుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న క్వారీ సమీపంలో గత కొన్ని రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. అయినా ఇసుకాసురుల అక్రమాలకు అడ్డుకట్టవేసే వారు కరువయ్యారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు స్పందించి ఇసుక క్వారీని అకస్మికంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలాఉండగా, ఈ ఇసుక అక్రమ తరలింపుపై టీజీఎండీసీ అధికారిని వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో ప్రయతి్నంచగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

నిబంధనలకు తూట్లు పొడుస్తూ..

దుందుబీ వాగులో ఇసుక తవ్వేందుకు అనుమతులు పొందిన సదరు వ్యక్తులు నిబంధనలను అతిక్రమించి ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారు. హద్దులు మీరి తవ్వకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. పేరుకు మాత్రంగా టీజీఎండీసీ ఓ ఉద్యోగిని అక్కడ ఉంచి టిప్పర్లకు పాస్‌లు జారీ చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. కానీ తవ్వకాలలో ఎంతమేరకు నిబంధనలు ఆచరణలో ఉన్నాయి, టిప్పర్లలో ఎన్ని టన్నుల ఇసుకను తరలిస్తున్నారో కూడా పర్యవేక్షించే పరిస్థితి లేదు. ఒక్కో టిప్పర్‌లో 30 నుండి 50 మెట్రిక్ టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. కానీ టీజీ ఎండీసీ జారీ చేసే పాస్‌లలో మాత్రం 19.50 మెట్రిక్ టన్నులుగా మాత్రమే నమోదు చేస్తున్నారు. ఇక పగలు రాత్రి తేడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. అంతేగాక హైద్రాబాద్,రంగారెడ్డి, తదితర జిల్లాల పరిధిలోకి సైతం రవాణా చేస్తున్నారు. 2.5 మీటర్ల లోతు నిబంధనను విస్మరించి సుమారు 8 నుంచి 10 మీటర్ల లోతుకు తవ్వకాలు చేపడుతున్నారు. వెంటనే ఆయా గోతులను మట్టితో పూడ్చి చదును చేస్తున్నారు.

డార్క్ ఏరియాలోనూ దోపిడీ

డార్క్ ఏరియాగా గుర్తించిన మిడ్జిల్ మండలంలో అసలు ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నాయి. భూగర్భజలాలు అట్టడుగుకు చేరడంతో ప్రభుత్వం మిడ్జిల్ మండలాన్ని డార్క్ ఏరియాగా గుర్తించింది. డార్క్ ఏరియాలో భూగర్భజలాల పెంపునకు ప్రభుత్వం.. వర్షం నీటిని ఒడిసి పట్టే విధంగా చెక్‌డ్యామ్, వాలుకట్టలు, ఊటకుంటలు, తదితర వాటిని నిర్మించి వర్షం నీరు భూమిలో ఇంకే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. అందుకే ఈ ప్రాంతంలో పూర్తిగా ఇసుక, మట్టి, తరలింపును నిషేధించారు. వాల్టా చట్టం అతిక్రమిస్తే చట్టపరంగా వ్యవహరించాలన్న నిబంధనలు బుట్ట దాఖలవుతున్నాయి. గతంలో మున్ననూర్, అయ్యవారిపల్లి, వాడ్యాల, చిల్వేరు గ్రామ శివార్లలో దుందుబీని లూఠీ చేశారు. ఇదిలాఉండగా, తమకు అనుమతులు ఉన్నాయంటూ నమ్మబలుకుతు దర్జాగా ఇసుకను కొల్లగొడుతున్నారు. దుందుబీ పరివాహక ప్రాంతంలో కొన్ని భూములను కొనుగోలు చేసి పట్టా చేసుకోవడం లేదా లీజుకు తీసుకోవడంతో ఇసుకాసురుల పన్నాగం ప్రారంభమవుతుంది. తదుపరి ఆయా భూమితో పాటు దుందుబీ వాగును గుంపగుత్తగా తోడేసి తరలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం




మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు




లవకుమార్ (ఫైల్)

మద్దూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మద్దూరు పట్టణ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని నాగంపల్లి గ్రామానికి చెందిన లవకుమార్(20) మద్దూరు పట్టణానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈక్రమంలో హెచ్‌పీ గ్యాస్ గోదాం దగ్గర ఉన్న మూల మలుపు దగ్గర మద్దూరు నుంచి వస్తున్న సిమెంట్ లారీ ఢీ కొట్టింది. దీంతో తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, నాగంపల్లి గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై బైఠాయించారు. అప్పటికే లారీ డ్రైవర్ పరారయ్యాడు. న్యాయం జరిగే వరకు కదిలేది లేదని గ్రామస్తులు బైఠాయించడంతో ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడి చేరుకొని వారిని నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి అనంతమ్మ, కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కలిచివేశాయి. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



మైసమ్మ అడవిలో షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైన బొలేరో వాహనం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మైసమ్మ అడవిలో బొలెరో వాహనం దగ్ధం

నవాబుపేట: మైసమ్మ అమ్మవారి దర్శనానికి వెళ్తున్న బొలెరో వాహనంలో ఒక్కసారిగా షాట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి పెను ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. ఆదివారం కోస్గి మండలం ముస్రిఫా గ్రామానికి చెందిన నరేష్ కుటుంబంతో కలిసి మైసమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు బయలుదేరి వచ్చారు. వారు జిల్లా కేంద్రం దాటి మైసమ్మ అడవిలోకి ప్రవేశించి దేవాలయానికి మరో 150 మీటర్ల దూరంలో వాహనంలో షాట్ సర్క్యూట్ వల్ల పొగలు, మంటలు మొదలయ్యాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనం ఆపి అందరిని వెంటనే కిందికి దించాడు. వాహనంలో వంట సామన్లు తీస్తుండగానే మంటలు చెలరేగాయి. దీంతో వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వాహనం క్యాబిన్‌లో వంటకోసం తెచ్చిన గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకొని పెద్దశబ్దంతో పేలిపోయింది. దీంతో అందరు భయభ్రాంతులకు గురయ్యారు. శబ్దానికి అడవిలో బాంబు పేలినట్లు శబ్దం వచ్చింది. రోడ్డుపై ఉన్న వారంత పరుగులు తీశారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసినా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న వారంతం త్వరగా తేరుకోవటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది.

వంద కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

మరికల్: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం వంద కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మరికల్‌కు చెందిన శ్రీనివాసులు, ధన్వాడ మండలం హనుమాన్‌పల్లికి చెందిన డొంకాల వెంకటయ్య అనే ఇద్దరు వ్యక్తులు కర్ణాటక నుంచి తెచ్చిన నకిలీ పత్తి విత్తనాలను కుమ్మరివాడలోని ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేశారు. అక్కడి నుంచి రైతులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. పట్టుబడిన విత్తనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఫారెస్టు భూమిని సాగు చేస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

- కేసు నమోదు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడి గుండం గ్రామ సమీపంలోని అడవిలో అక్రమంగా ఫారెస్టు భూమిని సాగు చేస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. ట్రాక్టర్లను టింబర్ డిపోకు తరలించినట్లు తెలిపారు. ఆదివారం స్పెషల్ టీం స్ట్రైక్‌ఫోర్స్ అధికారి మగ్దూం, రేంజర్ చంద్రశేఖర్ సంయుక్తంగా నల్లమల అడవిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల అడవిలో అక్రమంగా భూమిని సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అడవి హక్కుల పత్రాలు ఉన్న వారు కూడా అడవిని నరక కూడదన్నారు. అటవీ చట్టం ప్రకారం, 1967 చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతి లేకుండా అడవిలో ట్రాక్టర్లతో దున్నె వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయాలు అటవీ ప్రాంతంలోని ప్రజలు గమనించాలన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో



పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతున్న జూరాల

ధరూరు/ దోమలపెంట/ మదనాపురం/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో ఆదివారం మరింత తగ్గి.. 14 వేల క్యూసెక్కులు వచ్చిందని అధికారులు తెలిపారు. దీంతో తెరిచి ఉంచిన క్రస్టు గేట్లను మూసివేయడంతోపాటు నీటి కొరత కారణంగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. అయితే నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 84 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 834 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.759 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు చెప్పారు.

శ్రీశైలానికి 2,231 క్యూసెక్కులు..

జూరాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం నిలిచిపోవడంతో శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం సుంకేసుల నుంచి 2,231 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 831.1 అడుగుల వద్ద 50.6888 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాగా జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగుల వద్ద 215.8070 టీఎంసీలు.

రామన్‌పాడులో 1,017 అడుగులు..

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం సముద్రమట్టానికి పైన 1,021 అడుగులకు గాను 1,017 అడుగులకు వచ్చి చేరింది. జూరాల కుడి, ఎడమ కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఇదిలా ఉండగా రామన్‌పాడు ఎడమ కాల్వ ద్వారా 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

విద్యుదుత్పత్తి నిలిపివేత

జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఇన్‌ఫ్లో లేని కారణంగా విద్యుదుత్పత్తి నిలిపివేసినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. అంతకు ముందు ఉదయం ఎగువలో 4 యూనిట్ల ద్వార 156 మెగావాట్లు, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు ఉత్పత్తి చేశామన్నారు.

క్రికెట్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలి



ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రికెట్‌లో జిల్లా క్రీడాకారిణులు ఉన్నతస్థాయికి ఎదగాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ఆదివారం ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన క్రీడాకారిణులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ పట్టుదలతో ఆడితే క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణి మిథాలిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని క్రికెట్‌లో రాణించాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఎంపికలకు 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారన్నారు. మూడు జట్లుగా విభజించి ఈ నెల 9, 10 తేదీల్లో లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. లీగ్‌లో ప్రతిభ కనబరిచే వారిని త్వరలో జరిగే హెచ్‌సీఏ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. లీగ్ మ్యాచ్‌ల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ నర్సింహులు, ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామరావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, మన్నాన్, సీనియర్ క్రీడాకారులు ఆబెద్ హుస్సేన్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ అమ్మవారికి వెండి కిరీటం



వెండి కిరీటం బహూకరిస్తున్న భక్తులు

అలంపూర్ : జోగుళాంబ అమ్మవారికి భక్తులు వెండి కిరీటం బహూకరించినట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన తామరాడ ప్రసాద్ తండ్రి వసంత రావు ఆదివారం ఆలయ ఉద్యోగి చంద్రయ్య ఆచారిని కలిసి వెండి కిరీటం బహుకరించినట్లు పేర్కొన్నారు. భక్తులు బహుకరించిన వెండి కిరీటం 249 గ్రాముల బరువు ఉందని దీని విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అధికారులు, దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.

జీవన ఎరువులతో ఉపయోగాలెన్నో..



వరి పొలంలో అజొల్లా

అలంపూర్: పంటల సాగులో జీవన ఎరువులతో అనేక ఉపయోగాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ పేర్కొంటున్నారు. జీవన ఎరువులు ముఖ్యంగా వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. నేలలోని భాస్వరాన్ని అందుబాటులోకి తెస్తాయి. ఇప్పటి వరకు జీవన ఎరువుల్లో స్థూలంగా రెండు తరగతులు అందుబాటులో ఉన్నాయి. అవి 1. నత్రజని స్థిరీకరించేవి (నైట్రోజన్ ఫిక్సర్) 2. భాస్వరాన్ని అందుబాటులోకి తెచ్చేవి.

జీవన ఎరువుల ఉపయోగాలను పరిశీలిస్తే

- హార్మోన్లు, విటమిన్లు, ఎంజైములు లభ్యమై మొక్క పెరుగుదల చురుకుగా ఉంటుంది.
- అలాగే దిగుబడులు 10 నుంచి 20 శాతం వరకు పెరుగుతాయి. దీంతో 20 నుంచి 25 శాతం నత్రజని, భాస్వర ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చును.
- నేల నుంచి సంక్రమించే కొన్ని తెగుళ్ల నుంచి పంటను కొంత వరకు కాపాడవచ్చు.
- ఉపయోగకరమైన సూక్ష్మజీవులు కూడా గణనీయంగా పెరుగుతాయి.
- నేల భౌతిక లక్షణాలు మెరుగుపడతాయి. వేర్లకు గాలి, నీరు బాగా లభ్యమవుతాయి.
- భూసారం, ఫలదత పెరుగుతాయి.
- వృక్ష సంబంధిత భాగాల నాణ్యత రుచి పెరుగుతాయి.
- పశువుల మేతలో పోషకాల పరిమాణం పెరుగుతుంది.
- రైతులకు ఎరువుల ఖర్చు తగ్గుతుంది. జీవన ఎరువుల ధర కంటే లాభాల నిష్పత్తి అధికంగా ఉంటుంది.
- ఎరువుల దిగుమతికి అయ్యే ఖర్చు కూడా ఆదా అవుతుంది.
- పరిసరాల అనుకూలత వాతావరణ మిత్రత్వం కలిగి ఉంటాయి.
- జీవన ఎరువులు ఎంతగా ఉపయోగించుకుంటే అంతగా వృద్ధి చెందుతాయి.
- కాలుష్యం తగ్గుతుంది. నేలకు, పంటకు ఎ లాంటి హాని జరగదు.
- నత్రజని భాస్వర జీవన ఎరువులు రెండు వాడినప్పుడు అధిక ప్రయోజనం ఉంటుంది.

జీవన ఎరువుల వాడకంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- జీవన ఎరువులను వేడి, వెలుతురు తగిలే ప్రదేశాల్లో ఉంచకూడదు. చల్లని ప్రదేశాల్లో నిల్వ ఉంచాలి.
- జీవన ఎరువులను పురుగుల మందులతో, రసాయన ఎరువులతో కలిపి వాడరాదు.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు మొదటగా విత్తనాలను శిలీంధ్ర నాశనులతో శుద్ధి చేసి 24 గంటల తర్వాత జీవన ఎరువులను పట్టించాలి.
- ప్యాకెట్లపై సూచించిన గడువు తేదీ (షెల్ఫ్ పీరియడ్) గమనించాలి. గడువు దాటిన ఎరువులను వాడకపోవడం మంచిది.
- జీవన ఎరువులను ప్రభుత్వ రంగ సంస్థల నుంచి నమ్మకమైన సంస్థల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- పైరుకు నిర్దేశించబడిన ఎరువులను మాత్రమే వాడాలి.

జీవన ఎరువుల ఎంపిక ఇలా..

- పప్పు జాతికి (చిక్కుడు జాతి) పైర్లకు.. రైజోబియం స్పీషీస్
- వరి .. నీలి ఆకుపచ్చ నాచు, అజొల్లా, అజోస్పైరిల్లం లిపోఫేరమ్
- పత్తి, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు.. అజోస్పైరిల్లం బ్రాసిలెన్స్
- చెరుకు.. అజోటోబ్యాక్టరు, అసిటొబాక్టరు, అజోస్పైరిల్లం, భాస్వర జీవన ఎరువులు
- అన్ని పంటలకు, అన్ని నేలలకు ఫాస్ఫో బాక్టీరియా, మైకో రైజా